గత ఐదు దశాబ్దాలుగా ఖండాంతరాల్లో చిన్నా పెద్దా అందరినీ అలరిస్తున్న మంచి ఫ్రెండ్‌గా, మెదడుకు పదును పెట్టే పజిల్‌గా రూబిక్స్ క్యూబ్‌నే చెప్పుకోవాలి. హంగేరి దేశానికి చెందిన ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్ ఎమో రూబిక్ దీని సృష్టికర్త. దానిని కనుగొన్న అతనికే నెలరోజులకు గానీ దాన్ని ఎలా పరిష్కరించాలో అర్థం కాలేదు. అసలు 1974లో దానిని కనిపెట్టినప్పుడు, అది పరిష్కరించటం వీలవుతుందని కూడా ఆయన అనుకోలేదు. కాలచక్రం పరుగులు తీసింది. వేగం, సృజనాత్మకత పెరిగింది. క్యూబ్ కూడా కొత్త పుంతలు తొక్కింది. ఈ క్యూబ్‌ను పరిష్కరించటానికి ఇప్పుడు 43,252,00, 274,489,9856,000 మార్గాలు ఉన్నాయని గణితశాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

రూబిక్స్ క్యూబ్ కనుగొన్న ఈ 50 ఏండ్లలో అది ఎక్కువమంది ఇష్టపడే, వెంటపడే, ఎక్కువ సమయం గడిపే క్రీడాసాధనంగా మారిపోయింది. అంతర్జాతీయంగా ఇప్పటివరకు 36 కోట్లకు పైగా క్యూబ్‌లు అమ్ముడయ్యాయని అంచనా. చవకగా తయారైన వాటిని కూడా లెక్కలోకి తీసుకుంటే, వాటి సంఖ్య ఆకాశమంత పెరిగే అవకాశం ఉంది. కంప్యూటర్ ప్రోగ్రామర్లు, తత్వవేత్తలు, ఆర్టిస్టులు ఇలా వేర్వేరు వర్గాలను ఇది వెంటాడుతున్నది. వేగంగా సమస్యను పరిష్కరించేందుకు సూచనలు ఇస్తామని, క్యూబ్ డిజైన్ సిద్ధాంతాలను వివరిస్తామని, వాటి వెనక ఉన్న తాత్త్వికతను చెబుతామని వందలాది పుస్తకాలు మార్కెట్లోకి వచ్చాయి. అన్నీ బెస్ట్ సెల్లర్లుగా నిలిచాయి. డిజిటల్ యుగంలో ఎంతోమంది తమ అనుభవాలను యూట్యూబ్ వీడియోల ద్వారా వివరిస్తున్నారు. కొంతమంది శిక్షకుల అవతారమెత్తారు. గంటకు ఇన్ని డాలర్ల లెక్కన ఆన్‌లైన్‌లో పాఠాలు చెబుతున్నారు. అల్గారిథమ్స్‌ను డెవలప్ చేస్తున్నారు.


ఎర్నో రూబిక్ (అప్పుడు)

రూబిక్స్ క్యూబ్ గురించి... ''ఈ పజిల్ తెలివిగల యాంత్రిక ఆవిష్కరణ'' అంటారు కాగ్నిటివ్ సైంటిస్ట్ డగ్లస్ హోఫ్స్ టాడ్లర్. సరైన కాలక్షేపాన్ని అందించే వనరు, రూపకాలకు మూలం, ప్రేరణ ఇచ్చే సాధనం కూడా అని వర్ణించారు. ''మొట్టమొదట అది చాలా చాలా సులువుగా కనిపిస్తుంది. ఆరువైపులు, ఆరు రంగులుగానే ఉంటుంది. అంతలోనే, అతి తక్కువ సమయంలోనే నమ్మశక్యం కానంత కఠినంగా మారిపోతుంది' అంటారు తత్వవేత్త స్టీవ్ పెటర్ సన్.

**క్యూబ్‌తో రూబిక్ అనుభవాలు**

ఎర్నో రూబిక్ రెండో ప్రపంచ యుద్ధ సమయంలో 13 జులై 1944లో హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లోని ఒక హాస్పిటల్లో జన్మించాడు. అప్పుడు అది వైమానిక దాడులకు గురవుతూ ఉండేది. తండ్రి ఇంజినీర్. ఏరియల్ గ్లైడర్లు రూపొందించేవాడు. పిల్లవాడిగా ఉన్నప్పుడు రూబిక్‌కు బొమ్మలు గీయటం అంటే ఇష్టం. పెయింటింగ్, శిల్పకళ పట్ల కూడా అభిరుచి ఉంది. బుడాపెస్ట్ టెక్నికల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ చదివాడు. అనంతరం అప్లయిడ్ ఆర్ట్స్ కాలేజీలో చేరాడు. రేఖాగణిత నమూనాల పట్ల విపరీతమైన ఆసక్తిని ప్రదర్శించాడు. ప్రొఫెసర్‌గా విద్యార్థులకు డిస్క్రిప్టివ్ జామెట్రీ బోధించేవాడు. ఇందులో త్రీ డైమన్షనల్ షేప్స్‌ను, సమస్యలను వివరించటానికి టూ డైమన్షనల్ చిత్రాలను ఉపయోగించేవాడు. అది అస్పష్టంగా ఉండేది. ఇదే ఎర్నో రూబిక్ క్యూబ్‌ను అభివృద్ధి చేయటానికి దారిచూపింది.1974 వసంతకాలంలో ఒక రోజున రూబిక్ తన తల్లి అపార్టుమెంటులోని ఓ గదిలో మెరుగులు దిద్దే పనిలో ఉన్నాడు. ఆ గదంతా ఎటు చూసినా క్రేయాన్లు, దారాలు, పెన్సిళ్లు, పేపర్లు, చెత్తాచెదారం. వాటితోపాటు తాను పేపరుతోనూ, చెక్కతోనూ చేసిన క్యూబ్‌లు ఉన్నాయి.

''ఆ రోజు ఆ ఆలోచన ఎందుకు ఎలా వచ్చిందో నాకు తెలియదు'' అని తన ఆవిష్కరణ గురించి వివరించాడు రూబిక్. ఎనిమిది క్యూబులను ఒకదానికొకటి అతుక్కునేలా, అదే సమయంలో చుట్టూ తిరిగేలా రూపొందించాడు. దానిని చెక్కతో తయారుచేశాడు. వాటన్నిటిని కలపటానికి మూలల్లో చిన్న కన్నం పెట్టాడు. కానీ అది వెంటనే విడిపోయింది. ఎన్నో ప్రయత్నాల తర్వాత రూబిక్ విభిన్నమైన డిజైన్‌ను కనుక్కోగలిగాడు. క్యూబ్‌ల కదలిక కనిపించేలా దాని ముఖాలకు పసుపు, నీలం, ఎరుపు, ఆకుపచ్చ, తెలుపు తదితర రంగులు వేశాడు. రూబిక్ దాన్ని అటూ ఇటూ తిప్పాడు. మళ్లీ తిప్పాడు. ఇంకోసారి తిప్పాడు. కాని దాన్ని మొదట ఉన్న రూపానికి తేవటం అతనికి సాధ్యం కాలేదు. రంగుల చిట్టడవిలో కూరుకుపోయి, దాని నుంచి ఎలా ముందుకు వెళ్లాలో అర్థం కాక అవస్థలపాలయ్యాడు. ఓవైపు తన రోజువారీ పనులు చేసుకుంటూనే ఖాళీ సమయాల్లో క్యూబ్‌తో కుస్తీపట్టాడు. ఓరోజు పరిష్కారం దొరికింది. రూబిక్ వెంటనే హంగేరియన్ పేటెంట్ ఆఫీసుకు 'త్రీ డైమన్షనల్ లాజికల్ టాయ్' పేరుతో ఓ దరఖాస్తు పెట్టుకున్నాడు. అలా 1977 కల్లా రూబిక్ క్యూబ్ అనేది హంగేరి ఆటవస్తువుల షాపుల్లో ప్రత్యక్షమైంది. రెండేండ్ల తర్వాత 3,00,000 క్యూబ్‌లు అమ్ముడయ్యాయి. రూబిక్ అమెరికన్ కంపెనీ 'ఐడియల్ టాయ్' నుంచి కాంట్రాక్టు పొందాడు. మూడేండ్లలో క్యూబ్‌ల అమ్మకాల సంఖ్య పదికోట్లకు చేరుకుంది. అంతేకాదు క్యూబ్‌ను పరిష్కరించే మార్గాలను వివరిస్తూ వచ్చిన పుస్తకాలు అత్యధిక సర్క్యులేషన్ సాధించాయి. ఆ తర్వాత రూబిక్ సొంత స్టూడియో ప్రారంభించి కొత్త తరహా క్యూబ్‌ల రూపకల్పనకు కృషిచేశాడు. స్నేక్ అండ్ రూబిక్ టాంగిల్స్ లాంటివి అందులో కొన్ని.


ఎర్నో రూబిక్ (ఇప్పుడు)

**స్పీడ్ క్యూబర్స్**

1990ల్లో కొత్త తరం ప్రవేశించింది. స్పీడ్ క్యూబింగ్ రికార్డులు మొదలయ్యాయి. అండర్ వాటర్, స్కైడైవింగ్, కళ్లకు గంతలు కట్టుకుని.. ఇలా రకరకాలుగా